RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 88 | పేజీలు : 4 | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



భారత్‌లో యాపిల్ పే వచ్చేసింది.. ఎలా ఉపయోగించాలి? ఏయే ఫోన్లలో పనిచేస్తుంది?



యూపీ పోలీసుల దర్యాప్తు తీరుపై
సుప్రీంకోర్టు ఆగ్రహం

- యూపీ పోలీసు విభాగాన్ని రద్దు చేసి.. అన్ని కేసులు సీబీఐకి అప్పగిస్తాం
- నిందితుడు దొరికినా గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదుపై ప్రశ్నలు
- సంబంధిత అధికారి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం

మహిళలకు ఏసీ బస్సుల్లోనూ
ఉచిత ప్రయాణం


- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- 120 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 26,401 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోంది



అమరావతి

తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేక మని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, - మిగతా3లో

20 లక్షల ఉద్యోగాల
కల్పనే లక్ష్యం



- క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు..
- ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు
- యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

అమరావతి

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్--2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు. కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా - మిగతా3లో



బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం

- జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు
- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్..
రబీ పంటల మద్దతు ధర పెంపు

- కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు
- ఆవాలకు రూ.413, గోధుమకు రూ.25 చొప్పున పెంపు
- 3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ
- ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు కేంద్రం ఆమోదం



ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు వచ్చినా
ఉద్యోగుల వల్లే



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- "అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోంది
- ఇంకా సమస్యలున్నాయి.. ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలి
- 10.5లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారు.
- సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయట్లేదంటారు

కరీంనగర్

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే.. ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం.. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబ సభ్యుల్లా చూడాలని అధికారులకు సూచించారు. "అందరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇంకా సమస్యలున్నాయి.. ప్రజలకు సేవలందిస్తూనే సమస్యలు పరిష్కరించుకోవాలి. 10.5లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులే 4 కోట్ల ప్రజలకు సేవలందిస్తున్నారు. మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని. మంచి పేరు వచ్చినా, చెడ్డపేరు - మిగతా3లో



రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం

- ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్..
- జానారెడ్డి కుట్ర అంటూ సంచలన ఆరోపణ
- రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్
- రెండు స్థానాలు రెడ్లకే ఇచ్చారని తీన్మార్ మల్లన్న విమర్శ

గ్యారెంటీ పథకాలు
ఉచితాలు కావు



- కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!
- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య

హైదరాబాద్

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం
బుధవారం 30 సెప్టెంబర్ 2026
అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

బడి పిల్లల సురక్షితకై.. రూ 8 కోట్లు.

.....పాఠశాలల కాంపౌండ్ వాల్స్‌కు రూ.8 కోట్ల సిఎస్‌ఆర్ నిధులు ఇవ్వండి

హెచ్పీసీఎల్ ఆర్ ఎం ను కోరిన మంత్రి సవిత.



- విద్యార్థులు కృషి పట్టుదలతో ముందుకు వెళితే జీవితంలో విజయాలు సాధిస్తారు
- అధ్యాపకుడిగా మారిన మంత్రి పయ్యావుల కేశవ్
- అవమానాలను అవకాశాలుగా మలుచుకుంటే విజయాన్ని అందుకోవచ్చు.
- గ్రామీణ విద్యార్థులలో అపారమైన ప్రతిభ దాగి ఉంది మంత్రి పయ్యావుల కేశవ్
- యువత భవిత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన మంత్రి

బడిలో బడి పంతులుగా పయ్యావుల..!!





ఉరవకొండ, సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం.

విద్యార్థులు కృషి పట్టుదలతో ముందుకు వెళితే జీవితంలో విజయాలు సాధిస్తారని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.గురువారం రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ యువత భవిత కార్యక్రమం సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి మంత్రి పయ్యావుల కేశవ్... కొంతసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి ఉపయోగపడే విలువైన విషయాలను బోధించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలన్న కసి, పట్టుదల, కృషి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. జీవితంలో ఎదురయ్యే అవమానాలు అపజయాలతో కుంగిపోకుండా వాటినే విజయానికి మెట్లుగా మార్చుకోవాలని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. తాను కూడా పాఠశాల స్థాయిలో ఒక సందర్భంలో అవమానాన్ని ఎదుర్కొన్నానని... అయితే ఆ సంఘటనను సవాలుగా తీసుకుని కేవలం మూడు నెలల్లోనే తన సత్తా చాటుకున్నానని మంత్రి పయ్యావుల కేశవ్ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు."మనల్ని ఎవరైనా తక్కువగా అంచనా వేసినప్పుడు నిరుత్సాహపడకూడదు.అదే మనలోని ప్రతిభను నిరూపించుకునే అవకాశంగా - మిగతా3లో





మట్టికి అడ్డొస్తే మట్టి కరిపిస్తాం..!!

రవాణాను అడ్డుకోబోయిన ఇరిగేషన్ అధికారిని బెదిరించిన... హైవే కాంట్రాక్ట్ అనుచరులు..??

రవాణా దారుల తీరు కు భయపడి...అర్ధరాత్రిలో 100 ఫిర్యాదు చేసిన స్పందన కరువు.

అనుమతులు శూన్యం... అడిగేది ఎవరంటూ యదేచ్ఛగా రవాణా.

వ్యవసాయ రైతులకు శాపంగా... మట్టు లోతు గుంతలు.

నార్సింపల్లి చెరువులో.. 2 హిటాచీలు 12 టిప్పర్లతో అక్రమ మట్టి రవాణా.


అడ్డుకున్న రైతులు.... పనులు ఆపేసిన తాసిల్దారు.

మట్టి రవాణా దారుల బరితెగింపుకు... వెనక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు.



గోరంట్ల సెప్టెంబర్ 30 సీమ వార్త.

హైవే నిర్మాణ పనుల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ పొలాల మధ్య ఉన్న చెరువులో అక్రమ మట్టి రవాణాకు బరితెగించారు కాంట్రాక్టర్లు.ఈ అక్రమ రవాణా నడుకుపోయిన ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం బెదిరించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇలాంటి సంఘటన గోరంట్ల మండలంలోని నార్సింపల్లి చెరువులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గత రెండు రోజులుగా నార్సింపల్లి చెరువు సమీపంలో హైవే రోడ్డు పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మట్టి మాఫియా తరహాలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. చెరువులో అక్రమం మట్టి రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఇరిగేషన్ శాఖ అధికారి వాహనాలను అడ్డుకోపోతే రవాణా ఆపేది లేదని అడ్డుస్తే మీరే ఇబ్బంది - మిగతా3లో



హార్టికల్చర్ హబ్‌తో...
సీమ రైజింగ్..!!

.....హిందూపురంలో ఘనంగా 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్

.....రాయలసీమ రైజింగ్' ట్రాక్టర్ ర్యాలీ

.....పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





హిందూపురం,సెప్టెంబర్,30 సీమ వార్త సాయంత్రం.

రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ జోడింపు,కోల్డ్‌చైన్ మరియు అంతర్జాతీయ ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్" కార్యక్రమంపై రైతుల్లో, ప్రజల్లో సమగ్ర అవగాహన కల్పించేందుకు బుధవారం హిందూపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, ఎంజీఎం గ్రౌండ్ నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్న ఈ ర్యాలీ పట్టణ వీధుల గుండా ఉత్సాహంగా సాగింది.రాయలసీమలో ఉన్న - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం
బుధవారం 30
సెప్టెంబర్ 2026

పింఛన్ల పంపిణీలో ఎలాంటి మార్పు లేదు - మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ



తాడిపత్రి, సెప్టెంబర్ 30 సాయంత్రం (సీమ వార్త): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎలాంటి మార్పు లేదని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీ యధావిధిగా ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీ వేళలు మారాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. బ్యాంకు సెలవుల నేపథ్యంలో నగదు కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణంలోని 36 వార్డుల్లో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారన్నారు. అక్టోబర్ 1న అందుబాటులో లేని లబ్ధిదారులకు 2వ తేదీన సచివాలయంలో పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన... ఎన్జీవో ప్రతినిధులు

మదనపల్లి (విజయవాడ): సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బోజ్జిరెడ్డి ని, కమిషన్ సభ్యులను ప్రతినిధులు, ఉద్యోగులు, రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు.గత కొన్ని నెలలుగా పిఎన్సి ఎన్జీవో పై కొంతమంది వ్యక్తులు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో, వాటికి సంబంధించిన వాస్తవాలను వివరించేందుకు పి ఎన్ పి ప్రతినిధులు, ఉద్యోగులు, రైతులు కలిసి ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులకు పాయింట్‌వైజ్‌గా వివరణ అందించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పి ఎన్ పి ఎన్ జి ఓ ద్వారా దాదాపు 250 మంది స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన వారికి మెజారిటీ ఉద్యోగాలు కల్పించినట్లు పిఎన్సి ప్రతినిధులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు సంతోషం వ్యక్తం చేసినట్లు పి ఎన్ పి ప్రతినిధులు తెలిపారు. పిఎన్సి ప్రతినిధులు వెల్లడించిన అంశాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు సావధానంగా విన్నారు. అనంతరం వారు అందించిన సమాచారంపై సానుకూలంగా స్పందించినట్లు బి ఎన్ పి ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో పిఎన్సి చేపట్టే కార్యక్రమాలకు తమ సహకారంతో పాటు ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం కూడా అందిస్తామని కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు తెలిపినట్లు పేర్కొన్నారు.అలాగే, కంపెనీపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ రైతులకు, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే వ్యక్తులపై అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పిఎంపి కంపెనీ ప్రతినిధులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ ఛెర్మన్ చోళ్ళ బోజ్జిరెడ్డి, కమిషన్ సభ్యులు వెంకటప్ప, గొర్లె సునీత, కాకీ లక్ష్మి,తో పాటు
పిఎన్ఆర్ కంపెనీ సీఈఓ నరేష్ చౌదరి, రీజినల్ మేనేజర్ కీర్తి పులితో పాటు అనంతపురం, చిత్తూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు, చింతపల్లి, రంపచోడవరం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 150 మంది ఉద్యోగులు, 50 మంది రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో ఏవీఎస్ వెంకటరమణకు ఘన వీడ్కోలు



బొమ్మనహల్, సెప్టెంబర్ 30 (సీమవార్త): సాయంత్రం బొమ్మనహల్ మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న ఏవీఎస్ వెంకటరమణకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, మండల ప్రజలు ఆత్మీయంగా సత్కరించారు.ఏవీఎస్ వెంకటరమణ తన ఉద్యోగ జీవితాన్ని పాఠశాల క్లర్క్ స్థాయి నుంచి ప్రారంభించి డిప్యూటీ ఎంపీడీవో స్థాయికి ఎదిగారని తెలిపారు. వివిధ హోదాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో తన వంతు పాత్ర పోషించారని కొనియాడారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం. నారాయణస్వామి, కొత్తపల్లి రామదాసు, పి. మోహన్‌బాబు, పి. అనిల్, కొత్తపల్లి మహేంద్ర, సొల్లాపురం బాబు, అప్పారావు, టీడీపీ మండల కన్వీనర్ కే. మల్లన్న తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎంపీడీవో విజయభాస్కర్, సీనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్, శేఖర్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు, సిబ్బంది, బొమ్మనహల్, హీరేహాల్ మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొని ఏవీఎస్ వెంకటరమణను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన పదవీ విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛతలో మనమంతా భాగస్వామ్యం అవుతాం.

పిలుపునిచ్చిన ఎంపీడీవో కమల భాయ్.



గోరంట్ల సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం. మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛత భారత్లో మనమంతా భాగమవుదామని పిలుపునిచ్చారు ఎంపీడీవో కమల భాయ్. పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు మండల ఎంపీడీవో, స్థానిక పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కమలపై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛత భారత్ ముఖ్య ఉద్దేశం పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగే నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ నబి రసూల్, ఆగిశం నాగరాజు లతోపాటు వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనగలూరు టోల్ ప్లాజాలో స్వచ్ఛత హై సేవ

....ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి....మేనేజర్ ప్రకాష్ సూచన



ఓబులదేవరచెరువు (అక్టోబర్1)సీమవార్త: సాయంత్రం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని పాటించి ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇనగలూరు టోల్ ప్లాజా మేనేజర్ ప్రకాష్ సూచించారు.ఓడి చెరువు మండలం గాజుకుంటపల్లి సమీపంలో ఉన్న ఇనగలూరు టోల్ ప్లాజా లో స్వచ్ఛత హై సేవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా టోల్ ప్లాజా పరిసరాలను అక్కడి సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా టోల్ ప్లాజా మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ.... స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు.ఇల్లు, వీధి,గ్రామం సమీపంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొంటే చెత్తా,చెదారం పేరుకుపోయే సమస్య ఉండదు అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రకాష్ తో పాటు టోల్ ప్లాజా టీసీలు, మేనేజ్మెంట్ సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది తోపాటు పలువురు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలు.... మంచి భవిష్యత్తుకు పునాదులు.

వానవోలుతాండాలో సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో అంగన్వాడి పౌష్టికాహార మాసోత్సవాలు.

ముఖ్య అతిథులుగా...తహసిల్దార్ మధు నాయక్, మండల బిజెపి అధ్యక్షుడు లక్ష్మినారాయణ.



గోరంట్ల సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం వానవోలు తాండా లో అంగన్వాడి ఉత్సవం మరియు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ మధు నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, జిల్లా ఎస్సి ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నాయక్, ఉమా శంకర హరీష్ గ్రామ పెద్దలు రంగా నాయక్ పాల్గొన్నారు సూపర్వైజర్ నాగరాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలే కాకుండా, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, మానసిక వికాసానికి, విద్యాభివృద్ధికి పునాది వేసే కేంద్రాలని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి అక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా అర్హులైన గర్భిణులు, బాలింతలకు అందించే ఆర్థిక సహాయం, పథకం ప్రయోజనాలు, దరఖాస్తు ప్రక్రియ మరియు అవసరమైన వివరాల గురించి అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తల్లులు తహసిల్దార్ మధు నాయక్ మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలను పాటించాలని తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండే ఆహారం అవసరమని తెలియజేశారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి సరైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రామ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అంగన్వాడీ కార్యకర్తలు నీలాబాయి, ప్రమీల బాయి, అంగన్వాడీ సహాయకులు సరోజా బాయి, తులసీ బాయి, సాయిలతలను ముఖ్య అతిథులు శాలువాలు, సన్మానాలతో గౌరవించారు. జిల్లా ఎస్సి ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నాయక్ ఉమా శంకర్ అంగన్వాడి సిబ్బంది కి, హెల్త్ సిబ్బంది కి 6000 రూపాయలు ప్రోత్సాహక బహుమతి గా అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లులు, పిల్లల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా అభినందించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వానవోలు తాండా గ్రామంలో మహిళలు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలకు ఐసీడీఎస్ సేవలు, పోషకాహారం, ప్రీ స్కూల్ విద్య మరియు మాతా శిశు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అంగన్వాడీ సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం జరిగింది.

బడి పిల్లల సురక్షితకై.. రూ 8 కోట్లు.

పెనుగొండ సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం. పెనుకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ నిర్మించేందుకు రూ.8 కోట్ల సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హెచ్పిసిఎల్ అధికారులను కోరారు. కడపలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో బుధవారం హెచ్పీసీఎల్ ఆర్ఎమ్ మన్మదరావు మంత్రి సవితను కలిశారు. ఈ సందర్భంగా పెనుకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు కాంపౌండ్ వాల్స్ అవసరమని ఆమె వివరించారు. దీనిపై హెచ్పిసిఎల్ అధికారులు సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని తెలిపారు

బడిలో బడి పంతులుగా పయ్యావుల..!!

-మొదటిపేజీ తరువాయి

భావించాలి" అంటూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సైతం ప్రతిభలో ఎవరికీ తీసిపోరని... సరైన లక్ష్యం, కష్టపడే తత్వం ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలనుఅధిరోహించవచ్చని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మంత్రి పయ్యావుల కేశవ్ స్వయంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మమేకమై...పాఠ్యాంశాలతో పాటు జీవిత పాఠాలను బోధించడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.విజయం అనేది అదృష్టంతో వచ్చేది కాదు... లక్ష్యం, కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో సాధించేది...అనే సందేశాన్ని విద్యార్థులకు అందిస్తూ మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన ఈ ప్రేరణాత్మక బోధన ప్రత్యేకంగా నిలిచింది.

హార్టికల్చర్ హబ్ తో... సీమ రైజింగ్..!!

-మొదటిపేజీ తరువాయి



అనుకూలమైన వాతావరణం, ఉద్యాన పంటల సామర్థ్యాన్ని పుర్తిస్థాయిలో వినియోగించుకుని రైతులకు స్థిరమైన, లాభదాయకమైన ఆదాయం అందించడం.మైక్రో ఇరిగేషన్ (బిందు, తుంపర సేద్యం), రక్షిత సాగు (పాలీహౌస్/షేడ్‌నెట్) మరియు ఉద్యాన రంగంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తెవడం.పంటల అనంతర నిర్వహణ, కోల్డ్‌చైన్ నెట్‌వర్క్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడం.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "రాయలసీమ ఉద్యాన రంగ సామర్థ్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశం. విత్తనం నాటిన దగ్గర నుంచి పంట మార్కెటింగ్, ప్రాసెసింగ్, విలువ జోడింపు వరకు ప్రతి దశలోనూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రైతులు పాత పద్ధతులను వదిలి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని ఉద్యాన రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జయకుమార్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, మండల ఉద్యాన అధికారి మహేష్ నాయక్, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, ఆర్.ఎస్.కే సిబ్బంది మరియు స్థానిక రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


మట్టికి అడ్డొస్తే మట్టి కరిపిస్తాం..!!



-మొదటిపేజీ తరువాయి

పడతారని తరహాలో బెదిరించడం కలకలం రేపుతోంది. అయితే ఈ సందర్భంలో సంబంధిత అధికారి భద్రత కోసం 100 కీ కాల్ చేసి ఫిర్యాదు చేసిన ప్రతిస్పందన లేకుండా పోవడంతో ఆ ప్రాబ్లం నుంచి వెళ్ళిపోవాల్సి వచ్చిందని అధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.నార్సింపల్లి చెరువులో యదేచ్ఛగా అక్రమ మట్టి రవాణా చేస్తున్న సంఘటనపై ఆ ప్రాంత రైతులు పెద్ద ఎత్తున చెరువు వద్ద కు చేరుకొని రవాణాను అడ్డుకున్నారు. రైతులకు మద్దతుగా చెరువు నది పరివాహక ప్రాంత పెద్దలు నార్సింపల్లి రఘురాం రెడ్డి, బాలనగర్ పల్లి పోతుల రామకృష్ణారెడ్డి తదితరులు మద్దతుగా నిలుస్తూ అక్కడి వాస్తవ విషయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న తాసిల్దార్ మధు నాయక్ వాస్తవ పరిస్థితులను గమనించి మీకు ఎలాంటి పర్మిషన్ లేదని చెరువులో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 15 అడుగుల గోతులు తవ్వారని దీనివల్ల సమీప ప్రాంత ప్రజలకు పశువులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వెంటనే పనులు ఆపేయాలని ఆదేశించారు. ఇప్పటికే లోతుగా తవ్వినబోతులను సగానికి పైగా మట్టితో పూడ్చేయాలని ఆదేశిస్తూ రెవిన్యూ సిబ్బందిని అక్కడ నియమించారు. హైవే నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్నపాటి కంకర రాళ్లతో కూడిన మట్టిని వాడాల్సి ఉండగా డబ్బు ఆదా చేసుకున్నందుకు వక్రమార్గాన్ని ఎన్నుకొని చెరువు మట్టిని హైవే పనులకు వాడుతున్నట్లు తెలుస్తోంది. చెరువులో వాస్తవ పరిస్థితులను గమనించిన తాసిల్దార్ మధు నాయక్ ఎట్టి పరిస్థితులోనూ మీకు అనుమతులు ఇచ్చే పరిస్థితి లేదని మీరు వెంటనే హైవేకు సరిపడా మట్టి ఉన్న కొండ ప్రాంతాన్ని ఎంచుకొని అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని ఆయన తెలిపారు. మండల తాసిల్దార్ మరియు పాత్రికేయులు వస్తున్నారని సమాచారం తెలుసుకున్న అక్రమ మట్టి రవాణా దారులు అక్కడ నుంచి ఉడాయించిన సంఘటన చోటుచేసుకుంది.

15వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరాహార దీక్ష



బొమ్మనహల్, సెప్టెంబర్ 30 (సీమవార్త): సాయంత్రం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన నిరాహార దీక్ష 15వ రోజుకు చేరింది. దీక్షకు కార్యాలయం తరపున సీనియర్ అసిస్టెంట్ మద్దతు తెలిపారు.వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీ వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వీఆర్ఏలకు ప్రమోషన్లలో 30 శాతం నుంచి 70 శాతానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని వీఆర్ఏలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏల అధ్యక్షుడు మారుతితో పాటు రామకృష్ణ, ఆంజనేయ, బసయ్య, రవి, కీర్తి, అరుణ, మారన్న, వన్నూరు స్వామి, నాగరాజు, ఉలిగన్న, పోతరాజు, ప్రేమ్, సిద్దిలింగ తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

బుధవారం 30
సెప్టెంబర్ 2026

గుడిపల్లిలో రూ “60 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన కూటమి నాయకులు



సోమందేపల్లి సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని గుడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుడిపల్లి గ్రామంలో రూ “60 లక్షల రూపాయలతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ నూతన సీసీ డ్రైన్, సైడ్ వాల్, సిసి రోడ్ నిర్మాణ తదితర పనులకు బుధవారం కూటమి నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్య క్రమాలలో భాగంగా డ్రైన్, సి.సి రోడ్,సైడ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానికులు మంత్రి సవితమ్మ దృష్టికి గ్రామ సమస్యలనుతెలియజేయడంతో వారి విజ్ఞప్తి మేరకు హామీ ఇవ్వడంతో పనులు చేపట్టారు.ఈ డ్రైన్ నిర్మాణం పూర్తయితే చెరువు పక్కన ఉన్న మెయిన్ రోడ్డు లో నెలకొన్న మురుగునీటి పారుదల సమస్య పూర్తిగాపరిష్కారమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజల సమస్యలను సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని, త్వరితగతిన పనులు ప్రారంభించి నందుకు మంత్రి సవితమ్మ కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ “గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు వార్డుల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు”.ప్రతి గ్రామానికి నిధుల కేటాయింపులోనూ పారదర్శకత పాటిస్తున్నామని కూటమి నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, చల్లాపల్లి రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు రంగేపల్లి నాగరాజు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప పంచాయతీ నాయకులు రంగప్ప, కె.నరసింహులు, చలపతి, లక్ష్మీ నారాయణ, నారాయణ,ముద్దప్ప, నర్సింహులు, ఆదినారాయణ, సుధాకర్,రామాంజినేయులు, సుధాకర్, రంగనాథ నాయక్,బి వెంకటేష్, ఎస్ ఆర్ వెంకటప్ప, స్కూల్ చైర్మన్ శ్రీనివాసులు, నారాయణస్వామి, సంజీవ, సురేష్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

15వ రోజు నిరవధికంగా కొనసాగుతున్న వీఆర్ఏల సమ్మె



మడకశిర సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం మండలంలో 15 వ రోజు సహాయ నిరాకరణ దీక్ష కొనసాగిస్తున్న వీఆర్ఏ లు. తమ సమస్యల పరిష్కారం కోసం గత 15 రోజులుగా వీఆర్ఏలు సమ్మె చేయడం జరుగుతుంది. అయితే ప్రభుత్వము నుండి ఎలాంటి స్పందన లేక పోవడంతో యథావిధిగా వీఆర్ఏల సమ్మె కొనసాగుతోందని ప్రసంగం నాయకులు బాలకృష్ణ, నాగరాజు, రంగనాథ్ తెలిపారు.

ఘనంగా టిడిపి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ జన్మదిన వేడుకలు.



మడకశిర సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం పట్టణం లో తెలుగుదేశం పార్టీ నాయకులు టిడిపి జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో నియోజకవర్గంలో ఉన్నటువంటి టిడిపి నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటూ గత వైసిపి ప్రభుత్వం టిడిపి కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెట్టినప్పుడు టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటూ తనదైన శైలిలో కార్యకర్తలకు భరోసా కల్పించి పోలీస్ కేసులు కోర్టు విషయాలలో తనే స్వయంగా కోర్టులో వాదించి అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడినటువంటి మృదుస్వభావి, మారుమూల ప్రాంతమైనటువంటి మడకశిర ప్రాంతంలో విద్యార్థులు కార్పొరేట్ చదువులు అభ్యాసించే విధంగా విజయవాడ తిరుపతి వెళ్లకుండా తమ సొంత ఊరిలోనే చదువుకునే విధంగా విద్యాలయాన్ని ఏర్పాటు చేసి అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యా బోధన కల్పించినటువంటి వ్యక్తి , టిడిపి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పేద ప్రజల కష్టసుఖాల్లో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నటువంటి వ్యక్తి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తమ్ముడు గుండుమల రాధాకృష్ణ జన్మదిన వేడుకలు కార్యకర్తలు నాయకుల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ సాబ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు నరసింహ రాజు, తలమర్ల సుబ్బారాయుడు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు, క్లస్టర్ ఇంచార్జ్ రవికుమార్, మాజీ కౌన్సిలర్లు ఫయాజ్, విక్రమ్, సీనియర్ నాయకులు పుల్లయ్య చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ రంగే గౌడ్ అశ్వత్థ నారాయణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మయ్య గారి చంద్ర, నరేష్,ఈశ్వర్, రమేష్, రవి, మంజునాథ్, ఆంజనేయులు, శ్రీకాంత్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు ఇంటి పట్టాలు మంజూరుకు డిమాండ్



ఓబులదేవరచెరువు (సెప్టెంబర్30)సీమవార్త సాయంకాలం: మండల కేంద్రంలోని అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పల్లె... ఉమ కాలనీ వాసులు మోపురి శ్రీనివాసులు, పి జయరాజు,టి సురేంద్ర,ఎస్ బషీర్, ఎల్ నాగరాజు,ఎం వెంకటస్వామి,మనీ తదితరులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి.మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు మూడు రోజుల క్రితం చేపట్టిన విషయం తెలిసిందే.మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటైన ఉమమ్మ కాలనీలో అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మద్దతు ప్రకటించిన ఆర్సిపి నాయకులు మున్నా మాట్లాడుతూ ..... మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయడంలో సంబంధిత కార్యాలయాల్లో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండలంలోని అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకూ రిలే నిరాహార దీక్షలో కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.రిలే దీక్షలకు ఆర్సీపీ నాయకులు మున్నా, ఆంజనేయులు రైతు సంఘం కార్యదర్శి యు సుధాకర,ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి శ్రీరాములు,ఎం నాగరాజు తదితరులు మద్దతు తెలిపారు. ఉమమ్మ కాలనీలో నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి,ప్రభుత్వ పథకాల ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

పూజమ్మ అమ్మవారికి పాడి రైతుల ప్రత్యేక పూజలు, అన్నదానం





రొద్దం, సెప్టెంబర్ 30 (సీమవార్త సాయంకాలం): మండలంలోని చోళేమర్రి గ్రామ దేవత పూజమ్మ అమ్మవారికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చోళేమర్రి రైతులు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందన్నారు. వర్షాలు బాగా కురవాలని, పశువులకు పశుగ్రాసం సమృద్ధిగా ఉండాలని, చెరువుకు సాగునీరు సమృద్ధిగా చేరాలని, పంట పొలాలు పచ్చగా ఉండి పాడి పంటలు బాగుండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగా మహిమలు గల పూజమ్మ అమ్మవారికి రకరకాల పూలతో, పట్టు వస్త్రాలతో పురోహితులు, అమ్మవారి ప్రియ శిష్యులు వేణుగోపాల్ స్వామి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోళేమర్రి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జన్మదిన సందర్భంగా ఉచిత అన్నదానం ఏర్పాటు



మడకశిర సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని గుర్రపు కొండ గ్రామానికి చెందిన డి రంగప్ప కుటుంబ సభ్యులు భవ్య మంజునాథ్ కుమారుడు హయాన్స్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా హయాన్స్ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని దానిలోని భాగంగానే ఈసారి కూడా మండల పరిధిలోని ఆమిదాలవుంది సమీపంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భవ్య మంజునాథ్, సాయి చరణ్ దివ్య జ్యోతి, ఆర్ అనంతపురం నరసయ్య గౌడ్ రాధమ్మ, సీనియర్ పాత్రికేయులు గోవిందప్ప మంజమ్మ, మీ హాన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెదేపా హరికృష్ణ జన్మదిన వేడుకలు



సోమందేపల్లి సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని నల్గొండ రాయిని పల్లి కి చెందిన తెలుగుదేశం యువ నాయకుడు హరికృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం నిడారంభంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి ఓంకార్ సమక్షంలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తన తోటి మిత్రులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.. ఎంపీడీఓ

సోమందేపల్లి సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం సోమందేపల్లి లోని పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు బుధవారం బిపి షుగర్ హెచ్ఐవి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సఫయ్ మిత్ర సురక్షసేవ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఓంకార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందించారు. కార్మికులందరికీ ఆయుష్మాన్ కార్డ్ (హెల్త్ ఇన్సూరెన్స్) అందజేశారు.కార్మికుల భద్రత కోసం గ్లౌజులు, జాకెట్లు, మాస్కులను పంపిణీ చేశారు. కార్మికులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, మండల కన్వీనర్ వెంకటేశ్ ,మాజీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప, చల్లాపల్లి రామకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రమణ,జనసేన కన్వీనర్ జబీవుల్లా, మాగే చెరువు మాజీ సర్పంచ్ నరసింహ,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, రంగేపల్లి నాగరాజు ,ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర శ్యామలమ్మ సిహెచ్ఓలు జయమ్మ శిరీష ఏఎన్ఎంలు అయేషా నాగమణి జ్యోతి ఆశ వర్కర్లు నిరోషా భారతి శోభా కళావతి అశ్వని ఎన్జీవోలు శశికళ హరిత పాల్గొన్నారు.





అమడగూరు మండలం లొ సీమ వార్తకి స్పందన

పంచాయితీ స్పందన... చెత్తాచెదారం తొలగింపు.

అమడుగురు సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంత్రం. అమడగూరు గ్రామం లో చెత్త నేలకొని ఉండడం దానిని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లడంతో మేడం గారు తొందరగా స్పందించి అక్కడ ఉన్నటువంటి చెత్తను క్లీన్ చేపించడం జరిగింది గ్రామంలో నెలకొన్నటువంటి చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఎంతో కష్టపడి ఎన్నో రోజులుగా ఉన్నటువంటి చెత్తను క్లీన్ చేయడం జరిగింది . మా వార్తకు స్పందించి మా దృష్టికి వచ్చినటువంటి సమస్యను తొందరగా పరిక్షించారు ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి పంచాయతీ కార్యదర్శి మమత పారిశుద్ధ కార్మికులు డైమండ్ అంజి ఆదెమ్మ వెంకటరమణ నాగేంద్ర పాల్గొన్నారు

ఇసుక ట్రాక్టర్లకు వణుకు పుట్టిస్తున్న రెవెన్యూ శాఖ

పోలీసులు చేయలేని కట్టడిని రెవెన్యూ చేసి సత్తా చాటింది – మండల రైతులు, ప్రజల వెల్లడి





రొద్దం, సెప్టెంబర్ 30 (సీమవార్త సాయంకాలం): మండలంలోని పెన్నా నది నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లకు రెవెన్యూ శాఖ వణుకు పుట్టిస్తోంది. ఇసుక అంటేనే దడ, దడ అంటేనే రెవెన్యూ శాఖ అన్నట్లుగా గుర్తుండిపోయేలా చేస్తున్నారు మండల తహశీల్దార్ మరియు సిబ్బంది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసులు విఫలం కావడంతో పోలీసు శాఖకు కొంత మచ్చ వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్కడ జరిగే ప్రతి విషయం ఇసుక ట్రాక్టర్ల వారికి ముందే చేరవేయడమే దీనికి కారణమని, దానికి బ్రేక్ వేసి ఉంటే ఈ మచ్చ వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు. ఇది ఇలా ఉండగా కలిపి నుండి కర్ణాటక గుమ్మఘట్టకు వెళ్తున్న ఒక ట్రాక్టర్ ను, రొద్దం నుండి దొమ్మటమర్రికి ఇసుకతో వెళ్తున్న మరో ట్రాక్టర్ ను పట్టుకుని రెండు ట్రాక్టర్లను స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు మండల తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజు తెలిపారు. కేవలం పది రోజుల్లోనే ఇసుక అక్రమ రవాణాకు ఒక తహశీల్దార్ అడ్డుకట్ట వేయడం గొప్ప విషయమని పెన్నా నది పరివాహక రైతులు, మండల రైతులు, ప్రజలు తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజును అభినందిస్తున్నారు.

మూడు మెమోలు జారీ అయినా ఓటీయస్ ఉద్యోగులకు మోక్షం ఎప్పుడు?

క్షేత్రస్థాయి ఉద్యోగుల సంక్షేమం మరవద్దు: వెంకటేష్ బాబు



తాడిపత్రి, సెప్టెంబర్ 30 సాయంత్రం: రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం 18 శాతం వృద్ధి చెందడం వెనుక క్షేత్రస్థాయి ఉద్యోగుల కృషి కీలకమని, వారి సంక్షేమాన్ని మరవద్దని కమర్షియల్ టాక్సెస్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భవనారి వెంకటేష్ బాబు అన్నారు. ఓటీయస్ ప్రాతిపదికన 350 కి.మీ. దూరం వెళ్లిన ఉద్యోగులు జూలై 2026 నాటికే మూడేళ్ల కాలం పూర్తి చేసుకున్నారని, ఒకే సమస్యపై మంత్రి పయ్యావుల కేశవ్ పలుమార్లు ఆదేశాలు ఇచ్చి, ప్రభుత్వం మూడు సర్క్యులర్ మెమోలు (17.06.2026, 23.07.2026 మరియు తాజాగా 3387876, .28.08.2026) జారీ చేసినా అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. తాజా మెమోను వెంటనే అమలు చేసి అర్హులైన ఓటీయస్ ఉద్యోగులను మాతృ డివిజన్లకు పంపి న్యాయం చేయాలని కోరారు.

చంద్రశేఖర్ రెడ్డి కుటుంబంను పరామర్శించిన రఘువీరా రెడ్డి



సోమందేపల్లి సెప్టెంబర్ 30 సీమ వార్త సాయంకాలం మండలానికి చెందిన ఎస్.కె చంద్రశేఖర్ రెడ్డి కుటుంబంను బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి పరామర్శించారు. ఈ నెల19 వ తేదీన కర్ణాటక లోని దేవనహల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రశేఖర్ రెడ్డి భార్య సౌమ్య రెడ్డి మరణించడంతో వారి కుటుంబానికి రఘువీరారెడ్డి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యుడు కేటీ శ్రీధర్, మండల కన్వీనర్ గంగాధర్ వడ్డీ వెంకటేశులు రాయప్ప తదితరులు ఉన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881